సాక్షి జనగామ

శుక్రవారం । 2 । జూన్ । 2023

గరిష్ఠం/కనిష్ఠం
$39^0/27^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచే ఎండలు దంచికొడుతాయి. మధ్యాహ్నం ఎండతో పాటు వడ గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.



బీజేపీ, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలి
● ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

- వివరాలు 8లో


విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్ సముదాయం

స్వరాష్ట్ర ఆకాంక్షను తెలిపేలా..

- నేడు దశాబ్ది ఉత్సవాలు ప్రారంభం
- ముఖ్యఅతిథిగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- హాజరుకానున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

జనగామ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రాష్ట్రంలో సంబురాలు అంబరాన్నంటనున్నాయి. స్వరాష్ట్రం కోసం సాగిన తొలిదశ పోరాటంలో వందలాది మంది పోరాటయోధులు ఆత్మబలిదానాలు చేసినా వారి ఆకాంక్షను సాధించుకోలేకపోయారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ కాలం తర్వాత కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమం ప్రారంభించారు. అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ 14ఏళ్ల పాటు పోరాటం చేశారు. ఈ ఉద్యమంలో 1200మందికి పైగా బలవన్మరణాలకు పాల్పడగా.. అనేకమంది ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. కేసీఆర్ ఆమరణ దీక్షతో తెలంగాణ సమాజం కదిలొచ్చింది. దీంతో కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ ప్రత్యేక రాష్ట్రం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఉద్యమ నాయకుడు కేసీఆర్ కొత్త రాష్ట్రానికి మొదటి సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. పదేళ్ల కాలంలో రాష్ట్రం అనేక రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన దశాబ్ది ఉత్సవాలు జిల్లాల్లో నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

కలెక్టరేట్ సిద్ధం..

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల ప్రారంభోత్సవానికి సమీకృత కలెక్టరేట్ సిద్ధమైంది. అమరులకు నివాళులు, జాతీయ జెండా ఆవిష్కరణ, పదేళ్లలో రాష్ట్రం సాధించిన ప్రగతిని ఉద్దేశించి ముఖ్యఅతిథి ప్రసంగం, సాంస్కృతిక కార్యక్రమాలతో 21 రోజుల పండగకు శ్రీకారం చుట్టనున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగి పోతుండడంతో వేడుకలకు హాజరయ్యే అధికారులు, ప్రజల సౌకర్యార్థం షామియానాలతో పాటు గంట పాటు జరిగే ఉత్సవాల కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలను శాఖల వారీగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మొదటి రోజు నేడు కలెక్టరేట్‌లో వేడుకల ప్రారంభం తర్వాత శుక్రవారం 3వ తేదీన రైతు దినోత్సవ వేడుకలను జరుపుకోనున్నారు. 62 క్లస్టర్ల పరిధిలో నిర్మాణం చేసిన రైతు వేదికలను పూలు, మామిడి తోరణాలతో అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. రైతులతో సమావేశం ఏర్పాటుచేసి ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయ రంగానికి సర్కారు చేస్తున్న విజయాలను అందులో వివరిస్తారు.

8:40 నుంచి 9:30 గంటల వరకు..

దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నేడు(శుక్రవారం) కలెక్టరేట్‌లో పెద్ద ఎత్తున వేడుకలను ప్రారంభిస్తారు. ఉదయం 8:40 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కలెక్టరేట్ ప్రాంగణంలోని అమర వీరుల ప్రాంగణానికి చేరుకుంటారు. కలెక్టర్ శివలింగయ్య అతిథులకు స్వాగతం పలుకుతారు. 8:45 గంటలకు మంత్రి అమర వీరుల స్థూపానికి పూలమాలవేసి నివాళ్లర్పిస్తారు. 9 గంటలకు జాతీయ జెండాను ఎగురవేస్తారు. 9:05 నిమిషాలకు పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. జిల్లాలో పదేళ్ల కాలంలో జిల్లా సాధించిన ప్రగతిపై 9:10గంటలకు దయాకర్ రావు ప్రసంగిస్తారు. 9.30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్, మార్కెట్ చైర్మన్లు, కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, కవులు, కళాకారులు, అన్ని రంగాల ప్రజానీకం ఉత్సవాల్లో పాల్గొంటారు.

మున్సిపల్ ఎజెండాకు ఆమోదం



జనగామ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని వేడుకల నిర్వహణ కోసం మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో రెండు ఎజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. పురపాలికలో గురువారం చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. మున్సిపల్ కార్యాలయంతో పాటు వాహనాలు, పట్టణంలో విద్యుత్ దీపాల అలంకరణ, కార్మికులకు కొత్త బట్టల పంపిణీ, తదితర ఖర్చులు సుమారు రూ.12.60 లక్షలకు సభ్యులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ జె.రజిత, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, డీఈ చంద్రమౌళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నష్కల్ రామాలయంలో చోరీ



దిల్బూరు: నష్కల్ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు గోడ దూకి ఆలయ తలుపుల తాళాలు పగుల గొట్టి లోనికి వెళ్లారు. అక్కడ బీరువాలో ఉన్న మంగళ సూత్రాలతో పాటు హుండీని ఎత్తుకెళ్లి పక్కనే ఉన్న వాగు వద్ద హుండీని పగుల గొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. హుండీని నీటిలో పడేశారు. గురువారం ఉదయం అర్చకుడు గుడిని శుభ్రం చేసేందుకు వెళ్లగా తాళాలు పగుల గొట్టి ఉండడంతో సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్‌లకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని ఎస్సై వినయ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు చుట్టుపక్కల వెతుకగా హుండీ నీళ్లలో కనిపించింది.

బీఆర్‌ఎస్‌లో ఎర్రంరెడ్డి ప్రతాప్‌రెడ్డి చేరిక



దేవరుప్పుల: మండలంలోని కడవెండికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రంరెడ్డి ప్రతాప్‌రెడ్డి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో గురువారం హన్మకొండ క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హయాంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ ఫలాల అమలు పట్ల ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరినట్టు పేర్కొన్నారు.

కుటుంబ పాలన కోసం పాకులాట

దేవరుప్పుల: తెలంగాణ అమరుల కలలు విస్మరిస్తూ సీఎం కేసీఆర్ కుటుంబపాలన కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రయాసాలు పడుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు పెద్దగాని సోమయ్యగౌడ్ ఆరోపించారు. గురువారం మండలంలోని పెద్దమదూర్‌లో బీజేపీ సీనియర్ నాయకులు దూడల అరవింద్–గౌతమి వివాహానికి హాజరై మాట్లాడారు. పోరాటాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసేలా కేసీఆర్ రాచరికపు పాలన సాగిస్తున్నారన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పుసాల శ్రీమాన్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ పెద్దగొని రాజు, యువ మోర్చా నాయకులు మహిపాల్, రామారావు ఉన్నారు.

దైవ దర్శనానికి వెళ్తూ..

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- ముగ్గురి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం
- తిరుపతి, శ్రీకాళహస్తి మార్గంలో ఘటన
- దంతాలపల్లిలో విషాదఛాయలు



వెంకటమ్మ, అశోక్, సాన్వితాక్షరి(ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దంతాలపల్లి: అల్లుడి పుట్టెంటికలు తీసేందుకు సంతోషంగా తిరుపతికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం కుటుంబ సభ్యులతో కబుర్లు చెప్పుకుంటూ మార్గమధ్యలో శ్రీకాళహస్తి దైవక్షేత్రానికి దర్శించుకోవడానికి కారులో వెళ్తున్నారు. ఇంతలోనే ఘోరం జరిగింది. రెప్పపాటులో కారు ఆర్టీసీ బస్సును ఢీకొనటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరి పరిస్థితి విషమం కాగా, ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన తిరుపతి శ్రీకాళహస్తి మార్గమధ్యలో కాగా మృతులు మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన వారు. వివరాలిలా ఉన్నాయి.. దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన నెమ్మది లింగయ్య, వెంకటమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు వెంకన్న, రాంబాబు, అశోక్ కూతురు రేణుక ఉన్నారు. లింగయ్య వివిధ కారణాలతో 25 సంవత్సరాల క్రితం చనిపోగా వెంకటమ్మ తన పిల్లలను కష్టపడి పెంచి చదివించింది. పెద్ద కొడుకు వెంకన్న, రెండో కొడుకు రాంబాబు ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పెద్ద కొడుకు వెంకన్న, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక బాబు ఉన్నారు. వెంకటమ్మ తన కూతురు రేణుకను నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ప్రవీణ్‌కు ఇచ్చి వివాహం చేసింది. ఆ దంపతుల కుమారుడు దెవాన్స్(3)కు పుట్టెంటికలు తీసేందుకు అన్నలను మంగళవారం తిరుపతికి రావాల్సిందిగా కోరింది. దీంతో తల్లి వెంకటమ్మ, వెంకన్న ఇద్దరి కూతుళ్లు బాన్వితాక్షరి, సాన్వితాక్షరిని తీసుకొని కారులో బయలుదేరి తిరుపతికి వెళ్లారు. దైవదర్శనం అనంతరం అందరూ తలనీలాలు ఇచ్చి దారిలో శ్రీకాళహస్తి దర్శించుకొని ఇంటికి వస్తామని వస్తుండగా తిరుపతి, కాళహస్తి రహదారిపై ఏర్పేడు మండలం మేర్లపాక చెరువు సమీపంలో కారు, ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దీంతో నెమ్మది వెంకటమ్మ(60), చిన్నకొడుకు అశోక్(32), మనుమరాలు సాన్వితాక్షరి(5) అక్కడికక్కడే మృతి చెందగా మరో పాప బాన్వితాక్షరి, తండ్రి వెంకన్న విషమస్థితిలో ఉండగా తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో దంతాలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉత్సవాలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దశాబ్ది ఉత్సవాలను ప్రతి పల్లెలో పండుగలా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పాలకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనగామ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూన్ 2న నుంచి 22 వరకు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో చేయబోతున్న కార్యక్రమాలను మంత్రి ప్రకటించారు. 22వ తేదీ వరకు చేయబోతున్న కార్యక్రమాలను వివరించారు. సమీక్ష సమావేశంలో జనగామ కలెక్టర్ శివలింగయ్య, డీసీపీ సీతారాం, డీఆర్‌డీఓ రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధ్యం

- టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్



మల్యాతండాలో పౌల్ట్రీ ఫాంను ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణనాయక్

దేవరుప్పుల: వ్యవసాయరంగ అభివృద్ధితోపాటు అనుబంధ కుటీర పరిశ్రమలపై యువత దృష్టిసారిస్తే ఆర్థికాభివృద్ధి సాధ్యమని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణనాయక్ సూచించారు. గురువారం మండలంలోని మల్యాతండాలో భీక్యా పౌల్ట్రీ ఫారంను ఆయన ప్రారంభించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానప్పుడు గిరిజన యువత నిరాశ చెందకుండా కొద్దిపాటి వ్యవసాయ భూమి కలిగి ఉంటే ఇలాంటి ఉపాధి అవకాశాల వైపు ఆసక్తి కనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కష్ణమూర్తి గౌడ్, ఎంపీటీసీ మహ్మద్ జాకీర్ హుస్సేన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా సజ్జన్, గ్రామ అధ్యక్షుడు బోడ యాకన్న, అజ్మీరా సుమన్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి నుంచి 21 రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. 21రోజుల పాటు జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేలా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాలను జయప్రదం చేసేలా సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తేయాలి



చౌరస్తాలో నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బచ్చన్నపేట మండలంలోని గోపాల్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకోగా.. అక్కడి భూకబ్జాదారులు పేదలు, సీపీఎం నాయకులపై అక్రమంగా కేసులు బనాయించడం దారుణమన్నారు. భూకబ్జాదారులకు కొమ్ముకాస్తూ అధికారులు పేదలను, సీపీఎం నాయకులను జైలుకు పంపారన్నారు. అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్రి అహల్య, గోపి, చందు, అజారుద్దీన్, లలిత, సందీప్, బెస్లింగ్ టన్, మున్నీర్, ఉపేందర్, మల్లేష్, రజిత, నాజియా, భాగ్య పాల్గొన్నారు.

నాయకులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

దేవరుప్పుల : భూపోరాటం చేసిన నాయకులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేష్ డిమాండ్ చేశారు. సింగరాజుపల్లిలోని గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పయ్యావుల భిక్షపతి, ఇంటి వెంకటరెడ్డి, గడ్డం యాదగిరి, పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్ : రాజీవ్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మాసంపెల్లి నాగయ్య, కుమార్, గుండె సమ్మయ్య, గడ్డం పరశురాములు, అబ్బాస్, మైబు, పాల్గొన్నారు.

బచ్చన్నపేట : తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెవాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేజీవీపీ మండల కార్యదర్శి అన్నె బోయిన శ్రీనివాస్ మాట్లాడారు.

స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి : మండల కేంద్రాల్లోని సీపీఎం కార్యాలయాల్లో నిర్వహించిన సమావేశాల్లో మండల అధ్యక్షుడు మునిగెల రమేష్, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ మాట్లాడారు.

క్రికెట్ కిట్ అందజేత

లింగాలఘణపురం : మండలంలోని నేలపోగుల గ్రామంలోని యువతకు స్థానిక ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య గురువారం క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రికెట్ కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గైని ప్రవీణ్, తేరాల శ్రీకాంత్, ఆకుల సాయి, భాస్కర్, దయాకర్, హరీష్, వినయ్, శ్రీనాథ్, రోహిత్, దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

జనగామ రూరల్ : జనగామ జిల్లా కేంద్రంలోని వర్ధన్ ఆశ్రమంలో పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. జనగామ పట్టణానికి చెందిన రమ్య పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అన్నదానం చేయడం తనకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ నాయకులు జోగు భాస్కర్, రంజిత్, ఉదయ్, నరేంద్ర, పవన్ శివ, నరేష్, ఎల్లేష్, ప్రశాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి హుండీ బహూకరణ

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి హనుమకొండకు చెందిన వోమ ప్రకాశ్–పద్మజ దంపతులు రూ.30 వేల విలువైన హుండీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ప్రకాశ్ దంపతులను అర్చకులు ఆశీర్వదించారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న అర్జుల సంపత్‌రెడ్డి

చిల్పూరు : మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమాల నిర్వహణ కోసం తెలంగాణ రాష్ట్ర సీడ్స్ డైరెక్టర్ అర్జుల సంపత్‌రెడ్డి–రమదేవి దంపతులు సర్పంచ్ ఏదునూరి రవీందర ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గంగుల సంపత్‌రెడ్డికి గురువారం రూ.లక్ష 10 116లు నగదు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సంపత్‌రెడ్డి మాట్లాడారు. బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమాల కోసం దాతలు విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కంకటి రాజన్న, ఎంపీటీసీ కంకటి రవి, సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ చైర్మన్ మోతె శ్రీనివాస్, సందోజు రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కడియం సహకారంతో రోడ్డు పనులు

జఫర్‌గఢ్ : ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సహకారంతో కోనాయిచలం గ్రామంలో మట్టి రోడ్డు పనులు చేపడుతున్నట్టు సర్పంచ్ సాంటిరెడ్డి సంపత్‌రెడ్డి తెలిపారు. ఆ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన మట్టి రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో నర్సరీ రహదారి నుంచి గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సహకారంతో రూ.18 లక్షలు మంజూరైనట్టు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సింగారపు రఘుపతి, వార్డు సభ్యులు బొల్లెపల్లి నర్సిరెడ్డి, గోపరాజుల కోటి, కడియం యువసేన నియోజకవర్గ నాయకులు రడపాక అజయ్‌కుమార్, గోపారాజుల సంపత్, రాగి రాజిరెడ్డి, సాంటిరెడ్డి రాజిరెడ్డి రాజు పాల్గొన్నారు.

రూ.19 లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్‌లోని పాత గాంధీ చౌరస్తా నుంచి రైల్వే గేట్ వరకు రూ.19 లక్షల సీడీఎఫ్ నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టినట్టు సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ తెలిపారు. ఆ పనులను గురువారం ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. పనులను ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఏప్రిల్ 9న ప్రారంభించారని చెప్పారు. పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. నెలరోజుల్లో పనులను పూర్తి చేసి ఎమ్మెల్యే చేత ప్రారంభింపజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కనకం గణేష్, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యంపటేల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలతో సమావేశం

సర్పంచ్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఘన్‌పూర్ జెడ్పీ సెకండరీ, ప్రాథమిక పాఠశాలల, ఎస్సీ కాలనీ, ఇందిరానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో బడిబాటపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

బకాయిలు చెల్లించాలి

రఘునాథపల్లి : ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా నాయకుడు గంగాపురం మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆ సంఘం బృందం సందర్శించి సమస్యలను అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడారు. మూడు నెలలుగా కూలీలకు బిల్లులు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరు స్వరూప, ఐలయ్య, సువర్ణ, యాదమ్మ, ఎల్లమ్మ, నవ్య, నాగమణి, యాదమ్మ, రేణుక పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

తరిగొప్పుల : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. మండలంలోని మాన్‌సింగ్ శివారు బల్యా భూక్యతండాలో బుధవారం వివాహ బరాత్‌లో అర్ధరాత్రి వరకు డీజే మోగిస్తూ ప్రజలకు ఇబ్బంది కలుగడంతో 100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు అందగా డీజే నిర్వాహకుడు జాటోత్ వినోద్, ఆపరేటర్ భూక్య జితేందర్‌తోపాటు పెండ్లి కుటుంబం భూక్య శ్రీను, గుగులోత్ రాజేష్, గుగులోత్ నరేష్‌లపై గురువారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలి



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం



చెక్కులు పంపిణీ చేస్తున్న కడియం శ్రీహరి

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వ్యతిరేకులైన బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి నివాసంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కడియం మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో తెలంగాణ బ్రహ్మాండమైన అభివృద్ధి, ప్రగతి సాధించిందన్నారు. అన్నిరంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి చెందుతూ దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేసే బీజేపీ, కాంగ్రెస్ నేతలు తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. గతంలో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని, అందినకాడికి దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కుక్కలు చింపిన విస్తరిలా ఉందని, నాయకత్వంలో సమన్వయం లేదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి తెలంగాణకు చేసిందేమీ లేదని ఆరోపించారు. ఒక్క ప్రాజెక్టు అదనంగా తేలేదని, ఒక్క ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌ను తీసుకురాలేదన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని మండిపడ్డారు. గ్రామాల్లో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులను నిలదీయాలని, తెలంగాణకు ఏమి చేశారని చర్చించాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు సూచించారు.

ఇంటి పార్టీ బీఆర్‌ఎస్

తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధ/ద, సంక్షేమరంగాలకు పెద్దపీట వేశారని, మన ఇంటి పార్టీ బీఆర్‌ఎస్ అని కడియం అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేశారని, రైతులకు రైతుబంధు పేరిట 63లక్షల మందికి రూ.70వేల కోట్లు పెట్టుబడి సాయం అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతుబీమా, రైతులకు ఉచిత కరెంటుతో వ్యవసాయాన్ని పండుగ చేశారని తెలిపారు. తెలంగాణలో సాగువిస్తీర్ణం, పంటల దిగుబడి గణనీయంగా పెరిగిందని చెప్పారు. దేశంలోనే ఎక్కువగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి సాధించిందన్నారు. మిషన్ కాకతీయ పేరుతో చెరువులు, కుంటలను అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలోనే పూర్తి చేశామని, భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి రక్షిత మంచి నీరు అందిస్తున్నారని చెప్పారు. మిషన్ భగీరథపై కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కితాబు ఇచ్చిందని గుర్తుచేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తూ తెలంగాణకు దేశంలోనే అగ్రగామిగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు, ప్రజలందరూ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 50 మందికి రూ.20లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కడియం శ్రీహరి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా, నాయకులు నీల గట్టయ్య, బూర్ల శంకర్, పోగుల సారంగపాణి, ఎం.రాంబాబు, కరుణాకర్‌రావు, పురమాని రజాక్‌యాదవ్, నాగరబోయిన యాదగిరి, ఎం.లింగారెడ్డి, నీరటి ప్రభాకర్, జీడి ప్రసాద్, ఎల్మకంటి నాగరాజు, సింగపురం రవి, కుమార్ పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



జనగామ చౌరస్తాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: జనగామ పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తాలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరిశీలించారు. ఫౌంటేయిన్ చుట్టూ విద్యుత్ దీపాలంకరణ తదితర పనులను చూసి సలహాలు, సూచనలు ఇచ్చారు. చరిత్రలో నిలిచి పోయే విధంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఉండబోతున్నాయన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యదర్శి డాక్టర్ సుల్తాన్‌రాజా, ఆస్పత్రి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, నాయకులు విజయ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో సమీకృత కలెక్టరేట్



విద్యుత్ దీపాలంకరణలో ఆర్టీసీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం



జనగామ కలెక్టరేట్‌లో దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు

'పాలకుర్తి'లో నీలి జెండా ఎగిరేస్తాం

పాలకుర్తి టౌన్ : పాలకుర్తి నియోజకవర్గంలో నీలి జెండా ఎగరేస్తామని బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు జిలుకర రవికుమార తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం 1569 మంది ప్రాణత్యాగం చేస్తే వారి కుటుంబాలను నిర్లక్ష్యం చేసి దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమౌతోందని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాధికారం కోసం బహుజనులు ఏకం కావాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ పాలకుర్తి నియోజవర్గ ఉపాధ్యక్షుడు పడమటింటి భాస్కర్, మండల కోకన్వీనర్ చెరిపెల్లి కుమార్, నాయకులు ఉప్పుగల్లు సోమయ్య, చందులాల్ పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న శివరాజ్ యాదవ్

తరిగొప్పుల : రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభనబోయిన శివరాజ్ యాదవ్ కోరారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో శివరాజ్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేలా శ్రేణులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పబ్బోజు రాంబ్రహ్మచారి, బండ ప్రసాద్, ఎర్రవెల్లి ప్రతాప్, తలకొక్కుల శ్రీనివాస్, కొన్నె రాజు, కర్రె పోషయ్య, జంగ వీరకుమార్, రాజు, బాలయ్య, అల్పతి, కిష్టయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి



జనగామలో తెలంగాణ ఉద్యమ సమయంలో దీక్షలు (ఫైల్)

జనగామ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో నాటి ఉద్యమకారులను గుర్తించాలని జనగామ జేఏసీ నాయకులు వంగ భీమ్‌రాజు అన్నారు. గురువారం ఆయన జనగామలో మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం సాగిన ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారని గుర్తుచేశారు. 423 రోజుల పాటు శాంతియుత రిలే దీక్షలు, 17వేల మంది రక్తదానం, రాష్ట్రపతికి కోటి సంతకాల సేకరణ ఇలా అనేక ఉద్యమాలు చేశామన్నారు. ఎందరో తమ అమూల్యమైన సమయం, ఆర్థిక వనరులను పక్కన బెట్టి తెలంగాణ కోసం పనిచేశారని తెలిపారు. ఉద్యమకారులను ప్రస్తుతం గౌరవించాలన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసి చనిపోయిన బాధిత అమరులను ఫ్రీడం ఫైటర్లుగా గుర్తించి ఆ కుటుంబాలకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు, రైళ్లలో ఉచిత సౌకర్యం కల్పించి, భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహిపాల్

జనగామ రూరల్: వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శానబోయిన మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షంతో పంటలు పూర్తిగా దెబ్బతిని జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలనుపాలక శారద, అసెంబ్లీ కన్వీనర్ నవీన్, విజయ్, నటరాజ్, అంజి, నవీన్‌రెడ్డి, మధు, రాజు, రఫ్తర్ సింగ్, చందు పాల్గొన్నారు.